క్లుప్తంగా

నేడు సీహెచ్‌సీ భవనం ప్రారంభం



కంకిపాడు: అక్కినేని గోపాలకృష్ణమూర్తి, సుగుణ సామాజిక ఆరోగ్య కేంద్రం ఈనెల 24న ప్రారంభించనున్నట్లు సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు తెలిపారు. స్థానిక విలేకరులతో గురువారం వారు మాట్లాడుతూ నాబార్డు నిధులు రూ.4.60 కోట్ల అంచనా వ్యయంతో దాత అక్కినేని గోపాలకృష్ణమూర్తి వితరణగా ఇచ్చిన 1.69 ఎకరాల భూమిలో 30 పడకల సామర్థ్యం గల సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తయిందని, భవనానికి అక్కినేని గోపాలకృష్ణమూర్తి, సుగుణ సామాజిక ఆరోగ్యకేంద్రంగా నామకరణం చేశామన్నారు. ఆసుపత్రి భవనం ఈనెల 24వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి హాజరవుతారని, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గృహసారథులకు అవగాహన సదస్సు



ఉంగుటూరు: గృహసారథులు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించేందుకు కృషి చేయాలని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. ముక్కపాడు సచివాలయం పరిధిలోని వేమండ, లంకపల్లి, ముక్కపాడు గ్రామాల్లో ప్రతి 50 కుటుంబాలకు ఇద్దరు గృహసారథులను గురువారం నియమించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంకా ఎవరైనా అర్హత ఉండి సంక్షేమ పథకం లబ్ధి పొందనివారు ఉంటే వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రతి కుటుంబంతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ అమీర్ బాషా, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కంటి సమస్యలను అధిగమించాలి



కంకిపాడు: కంటి సమస్యలను అధిగమించాలని ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ సూచించారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 60 ఏళ్లు దాటిన 89 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. రాజేష్ కుమార్ మాట్లాడుతూ శుక్లాలు ముదిరిన వృద్ధులకు కంటి శస్త్రచికిత్సలు నిర్వహించి కళ్లజోళ్లు అందిస్తామన్నారు. ప్రాథమిక దశలో సమస్యలను గుర్తించి సకాలంలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎల్.భవాని, సీత, కె.విజయనిర్మల, కె.ప్రశాంతి, ఎల్.ఉదయశ్రీ పాల్గొన్నారు.

మార్చి 15 నాటికి నూరు శాతం ఇంటి పన్ను వసూలుచేయాలి

నున్న(విజయవాడరూరల్): వచ్చే నెల 15వ తేదీ నాటికి నున్న గ్రామంలో నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ అన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆయన పంచాయతీ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదికి నున్న గ్రామంలో కోటి 10 లక్షల రూపాయలు వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.45 లక్షలు మాత్రమే వసూలు జరిగినట్టు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని వచ్చే నెల 15వ తేదీ నాటికి వసూలు చేయాలన్నారు. వలంటీర్లు తమ పరిధిలో ఇళ్లకు వెళ్లి ఇంటి పన్ను వసూలుకు సహకరించాలన్నారు. సమావేశంలో సచివాలయ కార్యదర్శులు అజేంద్ర, వరుణ్‌బాబు పాల్గొన్నారు.

విశ్వశాంతి కోసం పీస్ ఫౌండేషన్

గన్నవరం: శ్రీస్వామి సారంగ్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ స్వామి సారంగ్ మోహిలికి గురువారం గన్నవరం విమానాశ్రయంలో పలువురు ఘనస్వాగతం పలికారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో హుస్సైని స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరగనున్న హుస్సైన్ డే వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన ఉత్తరప్రదేశ్ నుంచి ఇక్కడికి వచ్చారు. విమానాశ్రయంలో మోహిలికి సంఘ పెద్దలు ఎం.అబ్బాస్, అలందార్ హుస్సేన్ తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వశాంతి కోసం ప్రపంచ వ్యాప్తంగా తమ ఫౌండేషన్ పనిచేస్తుందన్నారు. భవిష్యత్‌లో తమ ఫౌండేషన్ ద్వారా ప్రపంచ శాంతి స్థాపనకు పీస్ యూనివర్సిటీ ఏర్పాటు దిశగా ముందుకువెళ్తున్నట్లు చెప్పారు.

గొడవర్రు లేఅవుట్‌లో చురుగ్గా మెరక పనులు



మెరక పనులు పరిశీలిస్తున్న సిబ్బంది

కంకిపాడు: పేదల సొంతింటి కల సాకారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పల్లపు ప్రాంతాలను మెరక చేసి అప్పగించటం ద్వారా జగనన్న లే అవుట్‌లో గృహ నిర్మాణాలు వేగవంతం కావటానికి మార్గం సుగమం అయింది. ముంపు సమస్య పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చేపట్టిన మెరక పనులు చురుగ్గా సాగుతున్నాయి.

1019 నివేశనస్థలాలు కేటాయింపు..

గొడవర్రు గ్రామంలోని ఏనుగుల కోడు సమీపంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం భూ సేకరణ చేసింది. 14.31 ఎకరాల భూమిని సేకరించి కంకిపాడు-1, 2 లే అవుట్‌లను ఏర్పాటు చేసింది. ఈ భూములకు ఎదురుగా ఉన్న 9.80 ఎకరాల భూమిని సేకరించి గొడవర్రు, మద్దూరు గ్రామాల లబ్ధిదారులకు నివేశన స్థలాలను కేటాయిస్తూ లే అవుట్ ఏర్పాటుచేశారు. కంకిపాడు-1, 2 లే అవుట్‌లలో 616 మంది పేదలకు స్థలాలను కేటాయించారు. గొడవర్రు గ్రామంలో 192 మందికి, మద్దూరు పరిధిలో 212 నివేశన స్థలాలను అర్హులైన పేదలకు కేటాయించారు.

వేగంగా ఇళ్ల నిర్మాణాలు

గొడవర్రు పరిధిలోని మొత్తం లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. లేఅవుట్ లోకి వెళ్లే మార్గాన్ని అభివృద్ధి చేయటంతో వాహనాల రాకపోకలు సులువుగా సాగుతున్నాయి. స్థానికంగా నీటి వసతి కల్పించేందుకు ఎనిమిది ప్రదేశాల్లో బోర్లు, అవసరమైన పైపులైను విస్తరణ కూడా పూర్తి చేశారు. విద్యుత్ లైన్లను విస్తరించారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు ఆయా లే అవుట్‌లలో వేగంగా జరుగుతున్నాయి.

రూ.80 లక్షలతో మెరక పనులు

లే అవుట్‌లో పల్లపు ప్రాంతాలను మెరక చేసి నిర్మాణాలు వేగంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా స్థలాల మెరకకు రూ.80 లక్షల నిధులు మంజూరు చేసింది. వీటితో ఏటిపాయల్లో లభించే ఇసుకను లేఅవుట్ పరిసరాలకు తరలిస్తున్నారు. దీంతో స్థలాల్లో నీరు నిలిచి ముంపు, మురుగు సమస్య తలెత్తకుండా మార్గం సుగమం అయ్యింది. ఈ సందర్భంగా గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ 'సాక్షి'తో మాట్లాడుతూ మెరక పనులు, మౌలిక వసతుల కల్పన లేఅవుట్‌లో వేగంగా సాగుతున్నాయన్నారు. లబ్ధిదారులకు మేలు చేకూర్చేలా వసతుల కల్పన జరుగుతోందని, స్థలాలు పొందిన ప్రతి ఒక్కరూ ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు.

ఈనాడు అభూతకల్పనలు ఇక చెల్లవు



గన్నవరంలో ఈనాడు పత్రికలను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

ఉయ్యూరు: ఈనాడు అసత్య ప్రచారాలకు ఇక కాలం చెల్లిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. గన్నవరం ఘటనపై టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిని పోలీసులు కొట్టినట్లు ఈనాడు పత్రికలో ప్రచురించటంతో మార్కెట్‌యార్డు వద్ద ఎమ్మెల్యే పార్థసారథి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఈనాడు ప్రతులను దహనం చేశారు. అనంతరం మాట్లాడుతూ పచ్చ మీడియా విష ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈనాడును అడ్డం పెట్టుకుని చంద్రబాబు, రామోజీ ఆడుతున్న దిక్కుమాలిన రాజకీయాలను ప్రజలు గ్రహించాలని కోరారు.

గన్నవరంలో...

గన్నవరం: ప్రజా సంక్షేమ పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఈనాడు పత్రిక, రామోజీరావు చేస్తున్న విషప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద గురువారం తప్పుడు కథనాలు ప్రచురించిన ఈనాడు పత్రిక ప్రతులను తగులపెట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనగాని రవి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య మాట్లాడుతూ ప్రజలకు వాస్తవాలను తెలియజేసే బాధ్యతాయుతమైన రంగంలో ఉన్న ఈనాడు యాజమాన్యం టీడీపీకి కొమ్ము కాస్తూ ప్రభుత్వంపై విషపు రాతలు రాయడం దుర్మార్గమన్నారు. పోలీసులు పట్టాభిని కొట్టినట్లు రెండేళ్ల క్రితం ఫొటోలను ఈనాడులో ప్రచురించి ప్రభుత్వం, పోలీసుల ప్రతిష్ట దెబ్బతీయాలని చూడడం దారుణమన్నారు. ఈ విషయాన్ని పార్టీ సోషల్ మీడియా శ్రేణులు బయటపెట్టడంతో తప్పు ఒప్పుకుని ఈనాడు క్షమాపణలు కోరిందన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి అసత్యాలను ఈనాడు ప్రచారం చేస్తే మాత్రం తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, మండల పార్టీ అధ్యక్షులు, కన్వీనర్ పడమట సురేష్, కైలే శివకుమార్, మాజీ సర్పంచ్ నీలం ప్రవీణ్‌కుమార్, పార్టీ నాయకులు కొల్లి రాజశేఖర్, జలసూత్రం రామ్మోహన్‌రావు, లుక్కా ప్రసాద్ పాల్గొన్నారు.

అబద్ధపు విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి



ఉయ్యూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: జగనన్న ప్రభుత్వంపై అబద్ధపు విష ప్రచారాన్ని సమష్టిగా తిప్పికొట్టి ప్రజలను చైతన్యం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక మార్కెట్‌యార్డులో ఉయ్యూరు పట్టణ, మండల గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ ఉయ్యూరు మండల అధ్యక్షుడు దాసే రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజావారధులై బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను, పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో నీతిమాలిన రాజకీయాలు జరుగుతున్నాయన్నారు. ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలి ప్రతిపక్షాలు విద్వేషాలను రెచ్చగొడుతూ ఘర్షణలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల కుట్రలను గృహ సారథులు ప్రజలకు తెలిపి వారిలో చైతన్యం నింపాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, ఎంపీపీ చీలి కల్పన, నాయకులు వల్లభనేని వెంకటేశ్వరరావు, రాజులపాటి రామచంద్రరావు, షేక్ అబుకలాం, తెనాలి పద్మావతి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పింఛన్ బాధలు తప్పాయి

గడపగడపలో లబ్ధిదారుల హర్షం



కానూరులో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి, బొప్పన భవకుమార్

పెనమలూరు: జగనన్న సీఎం అయిన తరువాత తమకు పింఛను కష్టాలు తప్పాయని, ప్రతి నెలా 1వ తేదీ వేకువజామునే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారని లబ్ధిదారు జి.సరోజిని ఆనందం వ్యక్తం చేసింది. తమకు రైతు భరోసా, సున్నా వడ్డీ ప్రభుత్వం సకాలంలో అందిస్తోందని నాంచారమ్మ అనే మహిళ ఆనందంతో చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కానూరు వినాయక్‌నగర్‌లో గురువారం విస్తృతంగా పర్యటించారు. ఆయన లబ్ధిదారులకు ఇంటికి వెళ్లిన సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. స్థానికంగా దోమల సమస్య, విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకురాగా వెంటనే ఆ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జగనన్న పాలనలో ప్రజలకు అండగా ఉంటూ ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేసే బాధ్యత తమపై ఉందన్నారు. కార్యక్రమంలో తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్ ఎన్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే చిట్టిబాబు, వేమూరి బాలకృష్ణ, తూమాటి శ్రీరాములు, ఆంజనేయప్రసాద్, తాళ్ల నరేంద్ర, సిద్దిక్, అన్నే శ్రావణ్, తుమ్మల వరదీప్, చాంద్‌బాషా, రెహమాన్, ఖాదర్, క్రిస్టోఫర్, లతీఫ్, సింహాద్రి రాజు, కూనపరెడ్డి రమేష్, మస్తాన్, చిన బాబు, మణికంఠ పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఎమ్మెల్యే వంశీ ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైద్య విద్య అభ్యసించేందుకు ఆసక్తి ఉన్నప్పటికీ కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించక ఇబ్బందులు పడుతున్న పేద విద్యార్థికి గురువారం గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ రూ.50 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. బాపులపాడు మండలం శోభనాద్రిపురానికి చెందిన వ్యవసాయ కూలీ అగ్నిపర్తి రాజారావు కుమార్తె క్రాంతికి డాక్టర్ చదవాలని అమితమైన ఆసక్తి ఉంది. వైద్య వృత్తి ద్వారా ప్రజలకు సేవ చేయాలనే తన కలను నెరవేర్చుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారాయి. ఈ నేపథ్యంలో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీని కలిసి తమ పరిస్థితిని వివరించారు. దీంతో స్పందించిన ఆయన నీట్ శిక్షణ కోసం రూ.50 వేలు ఆర్థికసాయాన్ని క్రాంతికి అందజేశారు. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా గురువారం అందించారు. భవిష్యత్‌లోనూ తన వంతు సహాయం అందజేస్తామనని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ చందు రమాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు చందు శివ, గండి కార్తీక్, అళ్ల భాను పాల్గొన్నారు.

ఘనంగా 45 అడుగుల హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద 45 అడుగుల ఎత్తయిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ 8వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలు, భజనలు, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ ధర్మకర్తలు పల్నాటి సత్యనారాయణ, బోడే వెంకయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అభయాంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరులోని దీపక్ నెక్సజెన్ ఫీడ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫ్యాక్టరీ యాజమాన్యం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల (వేమగిరి)కు చెందిన వైద్య నిపుణులు ఆధునిక పరికరాలతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వైద్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేయటంతో పాటుగా అవసరమైన వారికి కళ్లజోళ్లు, శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. ఫ్యాక్టరీ కార్మికులు, బొమ్ములూరు, కొయ్యూరు గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడాకారిణి శ్వేతకు అభినందనలు



గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న సాయి శ్రీ శ్వేతను గురువారం సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు, వైద్య కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు అభినందించారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీల్లో శ్వేత రజత పతకం సాధించింది. ఇప్పటి వరకూ శ్వేత పలు అంతర్జాతీయ, జాతీయ పోటీల్లో పాల్గొనడంతో పాటు అనేక పతకాలు సొంతం చేసుకున్నట్లు వారు వివరించారు. క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

క్షేత్ర స్థాయి వైద్య సేవలు ఎంతో ముఖ్యం

గన్నవరం రూరల్: గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పనిచేసే ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలని ముస్తాబాద పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శివప్రసాద్ అన్నారు. మాదలవారిగూడెం గ్రామంలో గురువారం జరిగిన ఏఎన్‌ఎంలు, ఆశ సెక్టార్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరంతరం వారి పరిధిలోని గృహాలను సందర్శిస్తూ ప్రజల ఆరోగ్య సమస్యలు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన యాప్‌లలో సమాచారం పంపాలన్నారు. సీహెచ్‌వో మెర్సీ, పలువురు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉంగుటూరు: తేలప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లలో చెట్ల తొలగింపు, మరమ్మతులు నిర్వహిస్తున్నందున పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ఏఈ మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తేలప్రోలు, సీతారామపురం(ఏ), బండారుగూడెం, ఆత్కూరు, ఆనందపురం, నారయ్య అప్పారావుపేట, పొట్టిపాడు, పెద అవుటపల్లి గ్రామాల్లో ఉదయం 7.30 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ రవి

గన్నవరం: మండలంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ అనగాని రవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి పలువురు పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టడంపై ఎంపీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి అధికారులు, కార్యదర్శులు రాకపోతే ప్రజా సమస్యలు ఎలా చర్చిస్తామని తెలిపారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులు, కార్యదర్శులకు నోటీసులు జారీచేయాలని ఎంపీడీవోకు సూచించారు. ముఖ్యంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. కీలకమైన తాగునీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న ఆ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం సరికాదన్నారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి

- రూ.1.50 కోట్లతో పనులు ప్రారంభం
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



కానూరు వినాయక్‌నగర్‌లో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న స్థానికులు, ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన గురువారం కానూరులో రూ.1.20 కోట్లతో 23 రోడ్లు, రూ.12 లక్షలతో వినాయక్‌నగర్‌లో అంగన్‌వాడీ భవనం, రూ.20 లక్షలతో వినాయక్‌నగర్‌లో సిమెంట్‌రోడ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం- అభివృద్ధి రెండు కళ్లలా చేపట్టి అమలు చేస్తోందన్నారు. తమ ప్రభుత్వంలో అసలు అభివృద్ధి జరగటం లేదంటూ టీడీపీ నేతలు ఒక కుట్ర ప్రకారం అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. టీడీపీ నేతలు కళ్లు తెరిచి చూస్తే అభివృద్ధి కనబడుతుందన్నారు. రానున్న కాలంలో తాడిగడప మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపుతానన్నారు. గత ఐదేళ్ల టీడీపీ పాలన, గత మూడున్నర సంవత్సరాల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమన్నారు. స్థానికులు వారి ప్రాంతాల్లో ఉన్న సమస్యలు తన దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాడిగడప కమిషనర్ ఎస్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అన్ని వసతులు కల్పిస్తాం

జగనన్న కాలనీలో అన్ని వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. వణుకూరు గ్రామంలో లేఅవుట 1లో నిర్మాణం పూర్తి చేసిన 362 మంది లబ్ధిదారుల గృహాలకు బుధవారం రాత్రి ఆయన విద్యుత్ కనెక్షన్ ప్రారంభించారు. కాలనీలో నిర్మాణం పూర్తి చేసిన గృహాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, సర్పంచి చెక్కా విజయ, ఉపసర్పంచి గద్దల రాజా, నేతలు వేమూరి రాజా, అక్బర్ బాషా, వల్లే నరసింహారావు, చెక్కా గోపీకృష్ణ పాల్గొన్నారు.

రైతులకు రూ.187 కోట్లు చెల్లింపు



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శివరామమూర్తి

విజయవాడరూరల్: ఎన్టీఆర్ జిల్లాలోని రైతులకు ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఇప్పటి వరకు 186.80 కోట్ల రూపాయలను చెల్లించినట్టు జిల్లా పౌరసరఫరాల మేనేజర్ పి.శివరామమూర్తి తెలిపారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ సమావేశం గురువారం ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ఖరీఫ్ సీజనులో ధాన్యం విక్రయించిన డబ్బులు ఇంకా అందలేదని అడిగారు. ఈ విషయమై జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శివరామమూర్తి మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రూ.236.20 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.186.80 కోట్లను రైతులకు చెల్లించామన్నారు. రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో 80 శాతం చెల్లించినట్టు వివరించారు. మిల్లుల వద్ద పెండింగ్‌లో ఉన్న ధాన్యానికి సంబంధించి క్లియరెన్స్ రాగానే వాటికి కూడా డబ్బులు చెల్లిస్తామన్నారు. జిల్లాలోని 267 రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇంకా రైతుల వద్ద నిల్వ వున్న ధాన్యం కొనుగోలు చేయాలంటే ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి వుందన్నారు. మండలంలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేయడానికి సభ్యులు సహకరించాలని ఎంపీపీ ప్రసన్న కుమారి విజ్ఞప్తి చేశారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు కోరారు. తహసీల్దారు పి.జాహ్నవి మాట్లాడుతూ సర్టిఫికెట్లను జారీ చేసే విషయంలో ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. వ్యవసాయాధికారి బి.రంగనాథ్ మాట్లాడుతూ రబీ సీజనులో సాగు చేస్తున్న రైతులతో ఈ క్రాప్ నమోదు చేసేందుకు సహకరించాలని కోరారు. ఇక నుంచి గ్రామస్థాయిలో కూడా వ్యవసాయ సలహా మండలి సమావేశాలు నిర్వహిస్తామని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి చెప్పారు. మండలంలో నాడు-నేడు కార్యక్రమంలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంఈఓ ఆదూరి వెంకటరత్నం తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వి.సురేష్, కోఆప్షన్ సభ్యుడు అల్తాఫ్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా కండక్టర్లకు అవగాహన సదస్సు



మహిళా కండక్టర్‌లకు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ వాసవి

రామవరప్పాడు: ప్రస్తుత సమాజంలో మహిళలు అనునిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని దిశ పోలీస్ స్టేషన్ సీఐ వాసవి అన్నారు. విద్యాధరపురంలోని ఏపీఎస్ఆర్టీసీ ట్రైనింగ్ సెంటర్‌లో మహిళా కండక్టర్లకు గురువారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, దిశ పోలీసు సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వాసవి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాపై విషయంలో జాగురూకతతో వ్యవహరించాలని, ఎలాంటి సమస్యలు ఎదురైనా దిశ పోలీస్ స్టేషన్‌లో ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు ప్రజ్వల సంస్థ ప్రతినిధులు మానవ అక్రమ రవాణా బాధితుల కథనాలపై డాక్యుమెంటరీలను ప్రదర్శించారు. విద్యార్థినుల ఆకతాయిల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజ్వల రాష్ట్ర సమన్వయకర్తలు కె. బలరామకృష్ణ, వై చంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థినిలకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోఆర్డినేటర్లు వినోద్, దేవ కరుణ, ఏపీఎస్ఆర్టీసీ ట్రైనింగ్ సెంటర్ అకౌంటెంట్ శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో కేసరపల్లి విద్యార్థినిలకు పతకాలు



పతకాలు సాధించిన కేసరపల్లి విద్యార్థినిలు

కేసరపల్లి(గన్నవరం): రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మండలంలోని కేసరపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భూపతి మనూజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జగ్గయ్యపేటలో గత మూడు రోజులుగా జరిగిన ఈ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. విద్యార్థులు సహస్ర బంగారు పతకం, కె.క్రాంతికుమారి, ఆర్.హవీల్ రజత పతకాలు, నాగరాజు కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. పతకాలు గెలుచుకున్న విద్యార్థులను ఉపాధ్యాయుల బృందం, పంచాయతీ పాలకవర్గ సభ్యులు మూల్పూరి మాధవన్ తదితరులు అభినందించినట్లు హెచ్‌ఎం తెలిపారు.

కానూరులో యువతి అదృశ్యం

పెనమలూరు: కానూరులో యువతి అదృశ్యం అవటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్‌కు చెందిన యువతి(21) ఐఐటీ కోర్సుకు శిక్షణ తీసుకుని ఇంట్లోనే ఉంటుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమె ఇంటి నుంచి అదృశ్యమయింది. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా జాడ తెలియలేదు. దీంతో యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు కింద నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.